సుర్మాయిగూడలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాన్ని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తున్న దృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుర్మాయిగూడ సర్వే నంబర్ 128 ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు ఎక్సకవేటర్‌తో మూడు నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


రెడ్డిబస్తీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి

చంపాపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను కోరారు. చంపాపేట డివిజన్ రెడ్డిబస్తీలో జీహెచ్ఎంసీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. వాల్ టూ వాల్‌గా రోడ్డు పనులు చేపట్టాలని కార్పొరేటర్ కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ సురేష్, బస్తీవాసులు రవిచారి, శ్రీనిధి, లావణ్య, రాకేష్, జయమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.


డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన

కొత్తపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మోహన్‌నగర్ భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. మోహన్‌నగర్‌లో రూ.9లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ పనులతో పరిసరాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు అరిఫ్, సూపర్‌వైజర్ దయాకర్, కాలనీ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు అశ్విన్‌సింగ్, కొత్తతిరుమల్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కుంట్లూర్‌లో సీపీఐ సభ్యత్వ నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ ఆర్ఎన్ఆర్‌కాలనీ ఫేజ్-2లో ఆ పార్టీ కుంట్లూర్ శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి హాజరై ప్రారంభించారు. పలువురికి పార్టీ సభ్యత్వాలను అందించారు. కార్యక్రమంలో భిక్షంనాయక్, వెంకటేశ్, శ్రీను, నగేష్, లింగస్వామి, మధు, సరిలాల్‌నాయక్, శంకర్‌నాయక్, రాములు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

ఎల్‌బీనగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పాస్టర్ ఫెల్లోషిప్ ఆధ్వర్యంలో ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేజ్-3లో ప్రీక్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరై క్రైస్తవులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ హానరబుల్ ప్రెసిడెంట్ ఎ. ఎలీషా, ప్రెసిడెంట్ ఎన్.జాన్, ఎస్. వసంత్‌కుమార్, విజయ్‌కుమార్, తిమోతిబాబు, ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.

బల్దియా గడ్డపై వీఆర్‌పీ జెండా ఎగురవేస్తాం

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు యెచ్చు సునీల్

మన్సూరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించుకుని బల్దియా గడ్డపై వీఆర్‌పీ జెండా ఎగురవేస్తామని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు యెచ్చు సునీల్ ధీమా వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ ప్రచార రథాన్ని నాగోల్‌లోని వీఆర్‌పీ కార్యాలయంలో ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఓయూ కేంద్రంగా ఆవిర్భవించిన తమ పార్టీ అన్నివర్గాలను కలుపుకుని ప్రజాక్షేత్రంలోకి వెళ్తోందన్నారు. ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే ప్రధానంగా తమ పార్టీ ముందుకుసాగుతోందని, ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలలు, ఆస్పత్రుల ద్వారా ఉచిత విద్య, వైద్యం అందించేందుకు పాటుపడతామన్నారు. తమ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే పార్టీ ప్రచార రథాన్ని ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్‌పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇజ్జగిరి కమలాకర్, అనిల్ గోగికర్, యెచ్చు అనిల్‌కుమార్, జీహెచ్ఎంసీ కార్యవర్గ సభ్యులు మహేష్ భాగవతుల, పాక నవీన్‌బాబు, కథలయ్య, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు పక్కా భవనం నిర్మించండి

మన్సూరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బండ్లగూడ ప్రాథమిక పాఠశాలకు కేటాయించిన స్థలంలో వెంటనే పక్కా భవనాన్ని నిర్మించి ఇవ్వాలని స్కూల్ ఎడ్యుకేషన్, సమగ్రశిక్ష ప్రాజెక్టుల డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నమ్మ కోరారు. ఈ మేరకు ఖైరతాబాద్‌లోని టెలిఫోన్ భవన్‌లోని కార్యాలయంలో మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అరుణాశ్రీనివాస్‌తో కలిసి డీఎస్ఈని అన్నమ్మ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అన్నమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాల ఓ చిన్న రేకుల షెడ్డులో కొనసాగుతోందని, విద్యార్థుల సామర్థ్యం ఎక్కువ ఉన్నందున ఆ భవనం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. వెంటనే పాఠశాలకు కేటాయించిన స్థలంలో పక్కా భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు డీఎస్ఈ సానుకూలంగా స్పందించినట్లు హెచ్ఎం తెలిపారు.

20మంది బాలికలకు సుకన్య సమృద్ధి పథకం ఖాతాలు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములకు చెందిన తెలంగాణ చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మోడెపు సత్యనారాయణగౌడ్ తన సొంత డబ్బులతో 20మంది బాలికల పేరిట సుకన్య సమృద్ధి పథకం పొదుపు ఖాతాలను తెరిపించారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమానికి స్వీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ఇంటింటికీ తిరిగి పథకంపై అవగాహన కల్పించి 20మంది బాలికల పేరిట స్థానిక పోస్టాఫీసులో పొదుపు ఖాతాలను తెరిపించినట్లు పేర్కొన్నారు. ఆడపిల్లల సంతానం ఉన్న తల్లిదండ్రులు ఈ పథకం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

రంగారెడ్డి కోర్టులు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 3వేల జరిమానాతో పాటు బాలికకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎంకె పద్మావతి తీర్పు చెప్పారు. పీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక పట్ల బండ్లగూడలో ఉండే ఉత్తరప్రదేశ్ బండ జిల్లా గిర్వా థాణా పరిధిలోని గోవర్ధనపురం గ్రామానికి చెందిన రామ్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తించి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తల్లి 2024 ఏప్రిల్ 30న ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.3వేల జరిమానాతో పాటు బాలికకు రూ. లక్ష నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

కేసీఆర్ ముద్ర చెరిపేయాలని కుట్ర

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ధ్వజం
- జిల్లెలగూడలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

సరూర్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్‌కు ఉన్న మంచిపేరు చెరిపేసేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ధ్వజమెత్తారు. అసలు ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం ప్రజలకు ఏం ఒరగబెట్టిందని ఆమె ప్రశ్నించారు. రాష్ట్ర చిహ్నంలో మార్పులు, తెలంగాణతల్లి విగ్రహంలో మార్పులు, బతుకమ్మ చీరలు మాయం చేయడం.. ఇదా అభివృద్ధి అంటే?.. అని ఆమె నిలదీశారు. తెలంగాణతల్లి విగ్రహంలో మార్పులు చేసి కొత్త విగ్రహం ప్రతిష్ఠించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని చందచెరువు కట్టపై గల తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి


చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్ కాలనీలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు

నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ అప్పట్లో కేసీఆర్ తెలంగాణ ఉద్యమకారులు, మేధావులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన రూపంలో తెలంగాణతల్లి విగ్రహానికి జీవం పోశారని, ఇప్పుడు ఆ విగ్రహం రూపాన్ని అర్థం పర్థం లేకుండా మార్చేశారని ఆరోపించారు. తెలంగాణలో కేసీఆర్ ముద్ర లేకుండా చేయాలన్నదే కాంగ్రెస్ పన్నాగమని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, పార్టీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, సరూర్‌నగర్ మాజీ ఎంపీపీ లావణ్యబీరప్ప, పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాజీనగర్ చౌరస్తాలో గల తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మంగళవారం బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్యగంటి అర్జున్, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, పార్టీ నాయకులు పెద్దబావి ఆనంద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ, కృష్ణారెడ్డి, గణేశ్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ప్రజల తలరాతలు మార్చాలి.. విగ్రహాలను కాదు : సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్ : ప్రభుత్వం మారితే, ప్రజల తలరాతలు మార్చాలి కానీ.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మండిపడ్డారు. చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్ కాలనీలో ఉన్న తెలంగాణతల్లి విగ్రహానికి మంగళవారం ఆయన క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని కాంగ్రెస్ తల్లిగా మార్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అస్తిత్వం మీద దాడి చేస్తూ, చరిత్ర ఆనవాళ్లను నాశనం చేసేందుకు కుట్రచేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ ఫ్లోర్‌లీడర్ పులిపాటి త్రివేది, బీఆర్ఎస్ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, రవి ముదిరాజ్, గట్టు శ్రీను, జయశ్రీ, రమణారెడ్డి, జలందర్, నిరంజన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


జిల్లెలగూడ చందచెరువు కట్టపై గల తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ఆర్‌కేపురంలో..

ఎల్‌బీనగర్ : ప్రజల తలరాతలు మారుస్తానని తెలంగాణ తల్లిని మారుస్తావా అని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆర్‌కేపురంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, రామాచారి, రామ్‌నర్సింహగౌడ్, సాజిద్, కొండ్ర శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, కంచర్ల శేఖర్, జగన్, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, బాలుశ్రీ పాల్గొన్నారు.

హస్తం గుర్తుతో ఉన్న తెలంగాణ తల్లి మాకొద్దు: సామ

సైదాబాద్ : హస్తం గుర్తుతో ఉన్న తెలంగాణ తల్లి మాకొద్దని బీఆర్ఎస్ యాఖత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేశవనగర్‌లో తెలంగాణతల్లి ఫ్లెక్సీకి బీఆర్ఎస్ నేతలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్, నర్సింగరావు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు స్థలం కేటాయించేందుకు మార్కింగ్

చాదర్‌ఘాట్: దిల్‌సుఖ్‌నగర్ సర్వీసు రోడ్డులోని ఆర్ఎస్ బ్రదర్స్ నుంచి వెంకటాద్రి థియేటర్ వరకు ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులందరికి సమాంతరంగా స్థలం కేటాయించేందుకు మంగళవారం మార్కింగ్ చేశారు. జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్ఐ రామస్వామి, రాముతో కూడిన బృందం సర్వీసు రోడ్డును ఆక్రమించకుండా ఫుట్‌పాత్ వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు చేపట్టే చర్యలపై ముందు సమీక్ష నిర్వహించారు. ఆర్ఎస్ బ్రదర్స్ నుంచి వెంకటాద్రి థియేటర్ వరకు 42మంది ఫుట్‌పాత్ వ్యాపారులకు 3అడుగుల నుంచి 5అడుగుల వరకు మాత్రమే స్థలం కేటాయించేలా మార్కింగ్ చేశారు. అయితే ఫుట్‌పాత్ వ్యాపారులందరికి సమానంగా స్థలం కేటాయించేలా ప్రతి ఒక్కరూ ఒకరినొకరు సహకరించుకోవాలని డీసీ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సూచించారు.

ఎమ్మెల్యే సూచన మేరకే..

దిల్‌సుఖ్‌నగర్ సర్వీసు రోడ్డులోని ఆర్ఎస్ బ్రదర్స్ నుంచి వెంకటాద్రి థియేటర్ వరకు ఉన్న ఫుట్‌పాత్ వ్యాపార కేంద్రాలను జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 అధికారులు మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులతో కలిసి పూర్తిగా తొలగించారు. దీంతో ఫుట్‌పాత్ వ్యాపారులందరు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను కలిశారు. తాము ఫుట్‌పాత్ వ్యాపార కేంద్రాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, ఫుట్‌పాత్ వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని పలువురు వ్యాపారులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈమేరకు ఆయన ఫుట్‌పాత్ వ్యాపారులతో సమావేశమై సర్వీసు రోడ్డును పూర్తిగా ఆక్రమిస్తూ, రోడ్డు కిరువైపులా పర్మినెంట్‌గా డబ్బాలను ఏర్పాటు చేయడం, ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వంటివి చేయరాదని ఎమ్మెల్యే సూచించారు. తాత్కాలికంగా తోపుడు బండ్లపై వ్యాపారాలను నిర్వహించి రాత్రికి పూర్తిగా ఖాళీ చేసేలా వ్యాపారులు కూడా సహకరించాలని సూచించారు. ఎవరైనా జీహెచ్ఎంసీ, మలక్‌పేట ట్రాఫిక్ పోలీసుల సూచనల మేరకు ఫుట్‌పాత్ వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇందులో వివాదాలకు దిగితే ఫుట్‌పాత్ వ్యాపార కేంద్రాలను పూర్తిగా తొలగించాలని తానే స్వయంగా సూచిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.


ఫుట్‌పాత్ వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు మార్కింగ్ చేయిస్తున్న జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

పోలీసుల జోక్యంతో సమసిన ఎస్సీ బాలికల వివాదం

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్‌లోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహంలో బాలికల మధ్య తలెత్తిన వివాదం, ఘర్షణ చాదర్‌ఘాట్ పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. సోమవారం రాత్రి ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినుల మధ్య వివాదం, దాడి విషయం తెలిసిందే. గాయపడిన విద్యార్థినులు చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఏఎస్‌డబ్ల్యుఓ శాంతిపై కొంతమంది విద్యార్థినులు ఫిర్యాదు చేయడం, ఆ తర్వాత ఆమెపై కొంత మంది విద్యార్థినులు రెచ్చగొట్టి దాడి చేయడం, దాడి చేసిన విద్యార్థినులు తమ తల్లిదండ్రుల సమక్షంలో క్షమాపణ చెబుతామని చెప్పి పిలిపించి వారితో కలిసి తిరిగి దాడికి దిగడం వంటి ఘటనలు సోమవారం రాత్రి చోటు చేసుకున్నాయి. ఇలాంటి వివాదాలకు కారకులైన ఐదారుగురు విద్యార్థినులను గుర్తించి వారిని మరో హాస్టల్‌కు తరలించాలని పోలీసులకు పలువురు విద్యార్థినులు సూచించారు. చదువుకునే విద్యార్థినుల మధ్య బేదాభిప్రాయాలు ఉండరాదని, సమష్టి కృషితో ఉన్నత విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని చాదర్‌ఘాట్ ఎస్ఐ రవిరాజ్ సూచించారు. విద్యార్థినుల మధ్య కేసులు పెట్టుకుంటూ పోతే ఉద్యోగాలకు దూరమై పోతారంటూ ఆయన నచ్చజెప్పారు. దీంతో విద్యార్థినులు పరస్పర అవగాహనకు రావడంతో వివాదానికి తెరపడింది. ఇదిలా ఉండగా ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఘర్షణ జరిగిన విషయమై విచారించేందుకు తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఏ ఒక్క అధికారి రాకపోవడం పట్ల పలువురు విద్యార్థినులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ యాదయ్య ఉన్నప్పుడు హాస్టల్‌లో ఏం జరిగినా వెంటనే పరుగెత్తుకుంటూ వచ్చేవారని, ఇప్పుడు ఆయన పదవి విరమణ చేశాడన్నారు. ప్రస్తుతం డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న కొండయ్య తాను రెండు రోజుల తర్వాత వస్తానని చెప్పినట్లు విద్యార్థినులు తెలిపారు.

గ్రూప్- 4 అభ్యర్థులకు జేఎన్‌టీయూ షాక్

- రెండేళ్లదాకా వేరే ఉద్యోగాల దరఖాస్తుకు వీల్లేదన్న అధికారులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ గ్రూప్- 4 ద్వారా ఎంపికై జేఎన్‌టీయూకు వచ్చిన ఉద్యోగులకు అధికారులు షాక్ ఇచ్చారు. యూనివర్సిటీ నిబంధనల ప్రకారం ఒకసారి జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన అభ్యర్థులు మరో రెండేళ్ల వరకు ఏ ఇతర ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. జాయినింగ్ రిపోర్టు ఇచ్చే సందర్భంగా అభ్యర్థుల నుంచి తీసుకునే డిక్లరేషన్‌లో 12వ పాయింట్‌గా అధికారులు ఈ నిబంధనను పొందుపరిచారు. ఈ నిబంధనతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి ఉద్యోగ పరీక్షలకు హాజరు కావాలనుకుంటున్న అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. దీంతో జాయినింగ్ రిపోర్టు ఇచ్చేందుకు యూనివర్సిటీకి వచ్చిన అభ్యర్థుల్లో సగానికి పైగా అభ్యర్థులు మరోమారు ఆలోచించుకొని వస్తామంటూ వెనుదిరిగారు. ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఈ తరహా నిబంధనలు ఏవీ లేవని, ఒకవేళ ముందుగా తెలిసి ఉంటే జేఎన్‌టీయూను ఎంచుకునేవాళ్లం కాదని అభ్యర్థులు వాపోయారు.

జేఎన్‌టీయూ అంటే హైదరాబాదే అనుకున్నం..

అలాగే, జేఎన్‌టీయూలో పోస్టింగ్ అంటే.. హైదరాబాద్‌లో అనుకున్నామని, వర్సిటీకి అనుబంధంగా ఉన్న కాలేజీలకు ఆప్షన్లు ఇవ్వమని అడిగేదాకా జిల్లాలకు పంపుతారని తెలియదని మరికొందరు అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. మొత్తం 74పోస్టుల్లో 40 పోస్టులు మాత్రమే హైదరాబాద్‌లో అని, మిగిలిన 34 పోస్టులు సుల్తాన్‌పూర్, మంథని, జగిత్యాల కాలేజీలో ఉన్నట్టు వర్సిటీ అధికారులు అభ్యర్థులకు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ల రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి టీజీపీఎస్సీ రూల్స్, జేఎన్‌టీయూ నిబంధనలు వేర్వేరుగా ఉండడంతో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. వర్సిటీ అధికారులు చెప్పిన కొత్త నిబంధనలపై టీఎస్‌పీఎస్సీ అధికారులతో మాట్లాడతామని, ప్రభుత్వశాఖల్లో మాదిరిగానే వర్సిటీ నిబంధనలను సవరించాలని కోరతామని పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో మొత్తం 74 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను నోటిఫికేషన్‌లో పేర్కొనగా, మంగళవారం వరకు కేవలం 34మందే జాయినింగ్ రిపోర్టు ఇచ్చినట్టు తెలిసింది.

అంకితభావంతో పనిచేయండి: ఇన్‌చార్జి వీసీ

జేఎన్‌టీయూలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు అంకితభావంతో పనిచేయాలని వర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ బాలకిష్టారెడ్డి సూచించారు. గ్రూప్4 ద్వారా ఎంపికై యూనివర్సిటీలో ఉద్యోగాలు దక్కించుకున్న అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మీతో పాటు నేను కూడా యూనివర్సిటీకి కొత్తగా వచ్చానని, ఎంతో కాలంగా పనిచేస్తున్న సీనియర్ అధికారులు మీకు మార్గనిర్దేశం చేస్తారని చెప్పారు. ఉన్నతాధికారులు సూచనల మేరకు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. సర్వీసు నిబంధనల ప్రకారం మీకు పదోన్నతులు లభిస్తాయని, ప్రతియేటా అప్రయిజల్ రిపోర్టు ద్వారా మీ పనితీరును సమీక్షిస్తామని చెప్పారు. గ్రూప్ - 4 అభ్యర్థులకు కౌన్సెలింగ్ కార్యక్రమంలో వీసీతో పాటు రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు సీఎం క్షమాపణలు చెప్పాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు అందెల డిమాండ్

సరూర్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆశ వర్కర్లందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజే ఆశవర్కర్లపై పురుష పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. మహిళా సంక్షేమమంటే ఇదేనా? అని ఆయన నిలదీశారు. తమ న్యాయసమ్మతమైన డిమాండ్లపై గళం విప్పిన ఆశ వర్కర్ల పట్ల పురుష పోలీసులు అసభ్యకర రీతిలో వ్యవహరించారని, ఈ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆశ వర్కర్ల డిమాండ్ల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని, వారిపై పోలీసులు చేసిన దాడికి సీఎం క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.


సీఎం కప్ క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, పక్కన సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ, డిప్యూటీ డీఈవో రాధాకృష్ణ

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

చాదర్‌ఘాట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు మంగళవారం మూసారాంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మి, సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ, డిప్యూటీ డీఈవో రాధాకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర వ్యాప్తంగా రేవంత్‌రెడ్డి సీఎం కప్ క్రీడాపోటీలకు శ్రీకారం చుట్టిందని వివరించారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉచితంగా క్రీడల్లో పాల్గొనేందుకు తమ పేర్లను నమోదు చేయించుకునే అవకాశముందని, ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ క్రీడాపోటీల్లో వాలీబాల్, కబడ్డీ, కోకో, ఫుట్‌బాల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ హరికృష్ణ, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. దాదాపు 15టీమ్‌లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయని వారు వివరించారు. కార్యక్రమంలో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్, స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్ ప్రిన్సిపాల్ శివకుమార్, ఫిజికల్ డైరెక్టర్ శుక్రునాయక్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


కుమావత్ పవన్

హయత్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్ చదువుతున్న విద్యార్థి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. భాగ్యలత శాంతినగర్ కాలనీకి చెందిన కుమావత్ పవన్ కొత్తపేట్‌లోని తపస్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం 7.30గంటలకు పవన్ కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. పవన్ కళాశాలకు వెళ్లకపోవడంతో కాలేజీ యాజమాన్యం పవన్ తండ్రి కుమావత్ బోమారంకు ఫోన్‌చేసి మీ కుమారుడు కళాశాలకు రాలేదని తెలిపారు. దీంతో బోమారాం కుటుంబ సభ్యుల వద్ద తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం సాయంత్రం బోమారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో చోరీకి యత్నం

కొత్తపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని మన్సూరాబాద్ అయ్యప్పస్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగుడు హుండీ చోరీకి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గుర్తు తెలియని దుండగుడు సోమవారం సమీపంలోని ఓ ఇంటి ముందు పార్కు చేసిన బైకును దొంగిలించాడు. బైకుపై అయ్యప్పస్వామి ఆలయం వద్దకు వచ్చాడు. బైకు అక్కడే పార్కు చేసి, ముఖానికి మాస్కు వేసుకుని, చేతులకు గ్లౌవ్స్ పెట్టుకుని వెల్డింగ్ షాప్ పక్కనుంచి ప్రహరీ దూకి గుడి లోపలికి వచ్చాడు. రాత్రి 12గంటల నుంచి 2గంటల వరకు వేచి ఉండి, హుండీని ఎత్తుకెళ్లేందుకు యత్నించాడు. అది సాధ్యం కాకపోవడంతో హుండీని గుడి వద్దే వదిలేసి, దొంగిలించిన బైకును తీసుకెళ్లడానికి యత్నించాడు. అదే సమయంలో బైకు యజమాని, పరిచయస్తులూ బైకు పార్కుచేసి ఉండడం చూసి గుడి వద్దకు వచ్చారు. వారు దుండగుడిని అడ్డుకోవడంతో అతడు పరారయ్యాడు. పరిసరాల్లోని మిగతావాళ్లకూ విషయం తెలియడంతో వారు స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి ఆలయం వద్దకు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఎల్బీనగర్, అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, అడ్మిన్ ఎస్ఐ నర్సయ్య, క్లూస్‌టీం, క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలు పరిశీలిస్తూ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి : కొప్పుల

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని అయ్యప్పస్వామి ఆలయంలో దుండగుడు చోరీకి యత్నించాడని, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి మంగళవారం పేర్కొన్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి చోరీకి పాల్పడ్డ వారెవరో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలు, మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమానికి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు స్కూల్ దశ నుంచే చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి మాట్లాడుతూ సైబర్‌క్రైమ్ పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపీశంకర్‌యాదవ్, స్కూల్ హెచ్ఎం రమేష్‌కుమార్, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన సదస్సు

సైదాబాద్ : చంపాపేటలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో సోమవారం మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంగ్లాండుతో మాగ్నా కార్టా ఒప్పందం ద్వారా ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కులు గుర్తించబడ్డాయని కళాశాల ప్రిన్సిపాల్ గంధం వెంకటేశ్వర్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు సునీత, శివరామశర్మ, రాజారెడ్డి, రేవతి పాల్గొన్నారు.

గృహ కార్మికుల హక్కుల సాధనకు కృషిచేయాలి

వనస్థలిపురం: గృహ కార్మికుల హక్కుల సాధనకు కృషి చేయాలని గృహకార్మికుల యూనియన్ రాష్ట్ర కోఆర్డినేటర్ సిస్టర్ జన్‌స్టర్స్ పిలుపునిచ్చారు. మంగళవారం వనస్థలిపురంలో గృహ కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ జన్‌స్టర్స్ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను సాధించుకోవడానికి ప్రతి కార్మికుడు సంఘటితమై పోరాడాలన్నారు. యూనియన్ లీగల్ అడ్వకేట్ వీరమళ్ల, మాధురి, పవన్ పాల్గొన్నారు.